బాధితుల గుండెల్లో రైళ్లు

- కొత్త రైల్వే ఎలైన్‌మెంట్‌తో తీవ్ర నష్టం
- ఇళ్లు, దుకాణాలు, పంట భూములు కోల్పోతామంటున్న ప్రజలు
- రెండు మండలాల్లో రైతుల ఆందోళన
- కలెక్టర్‌కు వినతిపత్రం



రైల్వేలైన్ కొత్త ఎలైన్‌మెంట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవల కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు, బాధితులు



కొత్త ఎలైన్‌మెంట్ కారణంగా బోడసకుర్రులో ఇళ్లు నష్టపోతున్న బాధిత మహిళలు

అమలాపురం రూరల్: కోటిపల్లి–నర్సాపురం మధ్య 2023లో చేపట్టిన రైల్వే ప్రాజెక్ట్ కోసం కొత్త రైల్వే ఎలైన్‌మెంట్ భూ సేకరణకు వల్ల అమలాపురం, అల్లవరం మండలాల పరిధిలోని సుమారు 80 మంది రైతులు, గృహవాసులు ఇళ్లు, పొలాలు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైను 57 కిలోమీటర్ల పొడవున నిర్మించాల్సి ఉంది. దీనితో భాగంగా అమలాపురం మీదుగా భట్నవిల్లి నుంచి పేరూరు మీదుగా పాశర్లపూడి వరకు 2003లో ఒక రైల్వే లైను ప్రతిపాదన చేసి భూ సేకరణ కోసం ఆయా సర్వే నంబర్లతో మార్కింగ్ చేశారు. 2023లో ఇదే అంశం తెరపైకి వచ్చింది. కొత్త రైల్వేలైను ప్రతిపాదన వల్ల ఇళ్లు, భూములు నష్టపోతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఎలైన్‌మెంట్ ప్రకారం 71 ఎకరాల భూమి సేకరిస్తున్నారు. కోనసీమ రైల్వే లైన్ ప్రతిపాదనలో భాగంగా 2001లో మొదటి ఎలైన్‌మెంట్ వచ్చింది. 2006లోనే కోటిపల్లి నుంచి అమలాపురం మండలం భట్నవిల్లి వరకూ భూ సేకరణ చేశారు. తొలి ఎలైన్‌మెంట్ ప్రకారం భట్నవెల్లిలో రైల్వేస్టేషన్ నిర్మించాల్సి ఉంది. కొత్త లైన్ (2023) ప్రతిపాదనపై రైతులు హైకోర్టుకు వెళ్లారు. భూ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని, అనువైన పాత, కొత్త లైన్ మార్గాలను కోసం సర్వే చేసి భూములను గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో రెండు లైన్లు సర్వే చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు.

12 గ్రామాలకు మంచి నీటి సరఫరాకు ఆటంకం

కొత్తలైన్ వల్ల చిందాడగరువు వాటర్ ప్రాజెక్ట్ దెబ్బ తినే అవకాశం ఉంది. కొత్త రైల్వే లైన్ వల్ల 12 గ్రామాలకు మంచి నీటిని సరఫరా చేసే అమలాపురం మండలంలో ఉన్న చిందాడగరువు వాటర్ ప్రాజెక్ట్ దెబ్బ తింటుందని ఆ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురాతన చరిత్ర కలిగిన చిందాడ మడుగు, అమలేశ్వర స్వామి దేవాలయం, చిందాడ మడుగు ఘాట్ మరుగునపడతాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాది నల్లా ప్రభాకరరావు, రైతులు, మట్టా సాయిరామారావు, తిరునాథం మురళి, జక్కపు స్వాతి, రంకిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు బాధిత రైతులు కలెక్టర్ మహేష్‌కుమార్‌ను ఇటీవల కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా కలెక్టర్ స్పందించి రెండు లైన్లు సర్వే చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఇళ్లు, పొలాలు నష్టపోతున్నాం



భట్నవిల్లి నుంచి పేరూరు మీదుగా పాశర్లపూడి వరకు 2003లో ఒక రైల్వే లైను ప్రతిపాదన చేసి రైల్వే లైన్‌కోసం భూ సేకరణ సర్వే నంబర్లతో మార్కింగ్ చేసి రైతుల పొలాల్లో రాళ్లు పాతారు. పాతలైన్ ఉండగా కొత్త లైన్ కోసం సర్వే చేశారు.కొత్తలైన్ వల్ల తమ విలువైన ఇళ్లు, పొలాలు నష్టపోతున్నాం.రైతులకు ఇబ్బందులు లేకుండా పాత రైల్వే లైన్ కొనసాగించాలి.

– ఆరవ పూర్ణచంద్రరావు, రైతు, పేరూరు, అమలాపురం మండలం

రైతులు తీవ్ర అభ్యంతరం

కొత్త రైల్వేలైన్‌కు సమాంతరంగా జాతీయ రహదారి 216 మూడు చోట్ల రైల్వే లైన్ క్రాసింగ్ వల్ల ప్రయాణీకులు ఇబ్బందులుపడాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు. పేరూరులో ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్ దూరమై భవిష్యత్తులో ఫుడ్ కార్పొరేషన్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని వారంటున్నారు. కొత్త ఎలైన్‌మెంట్‌పై అమలాపురం మండలం భట్నవిల్లి, కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం, ఇమ్మిడివరప్పాడు, పేరూరు, అల్లవరం బోడసకుర్రులో రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రైల్వేలైన్ తమ గ్రామాల మీదుగా వెళ్లేందుకు అంగీకరించేంది లేదని అభ్యంతరం చెబుతున్నారు. కొత్త ఎలైన్‌మెంట్ మార్పు చేయాలని ఆ గ్రామాల వాసులు పలు సందర్భాల్లో అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. కొత్త ఎలైన్‌మెంట్ అడ్డుగా వచ్చే రోడ్లు, వంట కాలువలు విద్యుత్ లైన్లు, స్తంభాలు, ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థల పైపులైన్లు, నివాసాలు, ఆర్‌డబ్ల్యూఎస్ మంచి నీటి పథకాలు పైప్‌లైన్లను సర్వేలో గుర్తించారు.

ఉపాధి కోల్పోతాం



కొత్త రైల్వే లైన్ ప్రతిపాదన వల్ల బోడసకుర్రులో ఇళ్లు, షాపులు కోల్పోతున్నాం ఎంతో కష్టపడి అప్పులు చేసి కట్టుకున్న ఇళ్లు నష్టపోతే ఎక్కడికి వెళ్లాలి. గానుగ నూనె వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాం. భూ సేకరణలో ఇళ్లు, షాపు దెబ్బతిని ఉపాధి పోతుంది. పాత లైన్ కొనసాగించి తమను ఆదుకోవాలి.

– జక్కపు సత్యవతి, బోడసకుర్రు, అల్లవరం మండలం

క్లుప్తంగా

పిల్లలకు చట్టాలపై అవగాహన



పిల్లలతో న్యాయవాది శ్రీపావని, అమ్మ వాణి

అమలాపురం టౌన్: పట్టణంలోని కామాక్షీ పీఠం ప్రేమ మందిరంలోని అనాథ పిల్లలకు న్యాయవాది గుళ్లపల్లి శ్రీపావని చట్టాలపై శుక్రవారం సాయంత్రం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. బాలబాలికల రక్షణకు ఎలాంటి చట్టాలు ఉన్నాయనే అంశంపై ఆమె అవగాహన కల్పించారు. ముఖ్యంగా సమాజంలో జరుగుతున్న పరిణామాలపై బాలికలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న తోటరాజు

యానాం: నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా కృషి చేస్తానని ప్రముఖ వ్యాపారి, సంఘ సేవకుడు తోట రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ఫెర్రీరోడ్డులో 'నా తొలి అడుగు మీతోనే' కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో అనేక ప్రజా సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని అనేక పరిశ్రమలు మూసివేతతో నిరుద్యోగ సమస్య ఎక్కువైందని, ఖాయిలాపడ్డ పరిశ్రమలను తెరిపించేందుకు, కుటీర పరిశ్రమల ప్రోత్సాహానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ భూమిని సేకరించి పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. సమగ్ర మేనిఫెస్టోను త్వరలోనే విడుదల చేస్తానని తెలిపారు. ఈ సభకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, యువకులు, నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట పవన్, మున్నా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆబోతుకు శస్త్ర చికిత్స



సమనసలో ఆబోతుకు శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ విజయరెడ్డి

అమలాపురం రూరల్: సమనస గ్రామంలో ఏడేళ్ల ఆబోతుకు కొమ్ము విరిగి వారం రోజులుగా రక్తస్రావంతో ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని వన్నెచింతలపూడి పశు వైద్యాధికారి పూర్ణిమ నాగలక్ష్మి దృష్టికి సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్, పశు ప్రేమికులు తీసుకువచ్చారు. గ్రామస్తుల సహకారంతో ఏరియా పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్. విజయరెడ్డి ఆ ఆబోతుకు శస్త్ర చికిత్స చేసి కొమ్మును తొలగించారు. త్వరలోనే అది కోలుకుంటుందని వైద్యులు తెలిపారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

కపిలేశ్వరపురం (మండపేట): స్థానిక అన్నపూర్ణ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం మాస్టర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ ప్రతిభ పోటీలు నిర్వహించారు. అండర్–15 మండల స్థాయి చెస్ టోర్నమెంట్ బీఎల్ఎస్ వరాహులు సమన్వయంలో నిర్వహించిన ఈ పోటీల్లో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో పూడి వినయ్ కార్తీక్, రెండో స్థానంలో తేలు వీరవెంకటసత్యనారాయణ, మూడో స్థానంలో సీరాం గణేష్ వీరేంద్ర గుప్త నిలిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు త్వరలో నిర్వహించనున్న ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఆడనున్నారని, వారికి మాస్టర్స్ చెస్ అకాడమీ స్పాన్సర్స్‌గా చేయూత ఇస్తారని నిర్వాహకులు తెలిపారు.

మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక

కె.గంగవరం: మండల మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక గురువారం రాత్రి ఏకగ్రీవంగా జరిగింది. కె.గంగవరంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షులుగా ఈర్ల రాజుబాబు, ఉపాధ్యక్షులుగా తోకల శ్రీను, గుబుపే దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా దానం వెంకన్న, ట్రెజరర్‌గా తోకల వెంకటరమణ, జాయింట్ కార్యదర్శులుగా ధార సత్యనారాయణ, ఇనకోటి వెంకటరమణ, కాటే సంజీవ్, పెట్టా రాజేష్, గౌరవాధ్యక్షులుగా పెట్టా శ్రీనివాస్, రవ్వా భూషణం, తారపట్ల ఆనందరావు, గౌరవ సలహాదారులుగా పాము భాస్కరరావు, సాదే నారాయణ, బత్తుల అప్పారావు, చిట్టిరాజు, కాటే సుబ్రహ్మణ్యం, దున్న అన్నవరం, బత్తుల జాగృత్‌కుమార్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మండల పరిధిలో దళితుల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు అన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

పవిత్ర శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సకల సంపదలను ఇచ్చే వరలక్ష్మి అమ్మవారికి మహిళలు తెల్లవారుజాము నుంచే పూజలు చేసి వ్రతాలు ఆచరించారు. అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



భువనేశ్వరి అమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



గ్రాంటు గ్రామంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో పాలకనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో భక్తులతో సామూహిక వ్రతాలు, పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యానాంలో..

యానాం: శ్రావణ శుక్రవారం సందర్భంగా యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సావిత్రి నగర్‌లో కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో గణపతి పూజ, అమ్మవారికి విశేష కుంకుమ పూజ, కలశ పూజ, నీరాజన మంత్ర పుష్పములు తదితర కార్యక్రమాలను అర్చకులు భాగవతిహరిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పడవలరేవు వీధిలో కొలువైన లలితాదేవి ఆలయంలో వరలక్ష్మీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. న్యూబస్టాండ్ వద్ద మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భువనేశ్వరి అమ్మవారికి అష్ట ద్రవ్య అభిషేకాలు

అమలాపురం రూరల్: బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పవిత్ర శ్రవణ వరలక్ష్మి వ్రతం సందర్భంగా భువనేశ్వరి అమ్మ వారికి భక్తులు అష్ట ద్రవ్య అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, 108 బంగారు పుష్పాల పూజలు, గో పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వరలక్ష్మి వ్రతం ఆచరించిన మహిళలకు శ్రీ శైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి సతీమణి చంద్రకళ వాయినాలు అందించారు.

ఆలయాల్లో రద్దీ

కాట్రేనికోన: శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ అమ్మవారికి ఇంటింటా ప్రత్యేక పూజలు చేసారు. అమ్మవారికి పిండి వంటలు, పండ్లు, నైవేద్యాలు సమర్పించి చామంతి పూలు, కుంకుమతో అర్చన చేసారు. వ్రత పూజ అనంతరం ముత్తయిదువులకు వాయినాలు అందించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం దేవాలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కుండలేశ్వరంలో కుండలేశ్వరుని ఆలయం, కాట్రేనికోనలో కనకలింగేశ్వరుని ఆలయం, తిమ్మాపురంలో శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయం, గచ్చకాయలపోర ఎంజీఆర్ కాలనీలో శ్రీలక్ష్మీనారాయ ణ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రేపు జనుపల్లిలో
ఇస్కాన్ సంకీర్తన భవనం ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ శివానంద నిమయిదాసు

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరం ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో అమలాపురం మండలం జనుపల్లిలో ఈనెల 10న ఆదివారం ఉదయం 7.42 గంటలకు సంకీర్తన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇస్కాన్ టెంపుల్స్ మేనేజర్ శివానంద నిమయిదాసు వెల్లడించారు. ఈ సందర్భంగా అమలాపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉభయగోదవారి జిల్లాలో 24 ఏళ్లుగా రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, తాడేపల్లిగూడెంలో ఇస్కాన్ సేవలు అందిస్తున్నారు. కోనసీమ కేంద్రమైన అమలాపురం మండలం జనుపల్లిలో తొలిసారిగా ఇస్కాన్ భవనం అందుబాటులోకి వస్తుందన్నారు. 10వ తేదీ ఆదివారం ఉదయం అమలాపురం గడియారం సెంటర్ నుంచి నగర సంకీర్తన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ఇస్కాన్ భవనం ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, సంకీర్తనలు నిర్వహిస్తామన్నారు. సంకీర్తన భవనంలో ఆదివారం మంగళ హారతి, శ్రీమాన్ సత్య గోపినాథ్‌దాస్ ఆధ్యాత్మిక సందేశం, వివిధ పోటీల్లో స్కూల్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు మహానగరి సంకీర్తన, అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన నుంచి శ్రీకృష్ణ జానాష్టమి వేడుకలు 9 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు శ్యామ్ సత్య ధర్మదాసు, సన్ బుజ్ ప్రభుదాసు, వరదా సూరిబాబు పాల్గొన్నారు.

వెటర్నరీ సైన్స్‌లో గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కుమారదత్త మహేష్

యానాం: దేశంలో ప్రతిష్టాత్మకమైన కోల్‌కత్తా లోని వెస్ట్ బెంగాల్ ఆఫ్ యూనివర్సిటీ ఆఫ్ యానిమల్ అండ్ ఫిషరీ సైన్స్‌సెస్‌లో ఎంవీఎస్సీ (మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్) విభాగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యనభ్యసించిన యానాం యువకుడు కుమారదత్త మహేష్ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించారు. మూడవ ఏడాది యూనివర్సిటీలో అత్యధిక మార్కులు కుమారదత్త మహేష్ సాధించారు. శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించిన కాన్వకేషన్–2025 కార్యక్రమంలో ఆయనకు బంగారు పతకం, సర్టిఫికెట్‌ను గవర్నర్ ఆనంద్‌బోస్ సమక్షంలో వైస్ చాన్సలర్ తీర్థకుమార్‌దత్త నుంచి అందుకున్నారు. మహేష్ 5వ తరగతి వరకు ప్రభుత్వ స్కూల్లో, 12వ తరగతి నవోదయ విద్యాలయ, బీవీఎస్సీ పుదుచ్చేరిలో చదివారని, అనంతరం వెస్ట్‌బెంగాల్ యూనివర్సిటీలో ఎంవీఎస్సీ సీటు రావడంతో ఆయన అక్కడ చదివినట్టు తండ్రి వీరవెంకటసత్యనారాయణ, తల్లి లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహేష్‌ను అభినందించారు.

గండ దీపాలతో ఊరేగింపు



అమలాపురంలో గండ దీపాలతో ఊరేగుతున్న ఆడ పడుచులు, భక్తులు

అమలాపురం టౌన్: శతాబ్దాల చరిత్ర ఉన్న అమలాపురం పట్టణం కల్వకొలను వీధిలో వేంచేసి ఉన్న వేప చెట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆడపడుచులతో గురువారం రాత్రి గండ దీపాల ఊరేగింపు దేదీప్యమానంగా నిర్వహించారు. అమ్మ వారి సంబరం, ఊరేగింపు శుక్రవారం తెల్లవారుజాము వరకూ కొనసాగింది.ఈ సంబరాలకు కల్వకొలను వీధి, మెబర్లీపేట తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది ఆడపడుచులు తమ మెట్టినింట నుంచి పుట్టింటికి వచ్చి ఈ సంబరాల్లో పాల్గొని వేప చెట్టు అమ్మకు మొక్కలు తీర్చుకున్నారు. గండ దీపాలను ఆడ పడచులు నెత్తిన పెట్టుకుని ఊరేగింపు అమ్మ వారి ఆలయం వద్ద గల గద్దెకు చేరుకుని అమ్మవారికి మొక్కలు తీర్చుకున్నారు. రాత్రంతా అమ్మవారి జాగారంలో ఆడపడుచులు నిమగ్నమయ్యారు. ఊరేగింపు గరగ నృత్యాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో సాగింది. చలిమిడి, బెల్లం పానకం కావిళ్లతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వేలాదిమంది గండ దీపాలతో ఊరేగింపులో పాల్గొవడంతో కల్వకొలను వీధి రాత్రంతా కాంతులీనింది. జాగారం, ఊరేగింపు సందర్భంగా అమ్మవారిని గాజుల గౌరిగా కొలిచి గాజులతో అలంకరిండచంతో భక్తులు దర్శించుకుని తరించారు. అనంతరం ఆ గాజులను ఆడ పడుచులు తీసుకుని ధరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కపిలేశ్వరపురం (మండపేట): ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పుల్లేశ్వరరావును రాష్ట్ర కార్యదర్శిగా ప్రకటించారు. పోస్టల్ శాఖలో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో 35 ఏళ్ల పాటు సేవలందించారు. నియామకం అనంతరం శుక్రవారం పుల్లేశ్వరరావు మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. పెన్షనర్ల సమస్యలను అధ్యయనం చేసి ఉద్యమ కార్యాచరణకు కృషి చేస్తామని పుల్లేశ్వరరావు తెలిపారు.

దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ అయింది. ఎండోమెంట్స్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నుంచి ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. దేవస్థానం ఆదాయాల ప్రాతిపదికన ట్రస్టు బోర్డు సభ్యులు ఎంత మంది ఉండాలి అన్న అంశాన్ని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. రూ.5 కోట్లలోపు ఆదాయం వస్తున్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి 11 మంది సభ్యులతో ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయనున్నారు. వీరిలో అయిదుగురు మహిళలు విధిగా ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఇద్దరు, బీసీలు నలుగురు వీరిలో ఒకరు విధిగా నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన వారై ఉండాలని జీవోలో పేర్కొన్నారు. ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. చైర్మన్ పదవితో పాటు ట్రస్టు బోర్డు సభ్యులు పదవులు పొందేందుకు లాబీయింగ్ మొదలుపెట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



వేములపల్లిలో పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం (మండపేట): అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై ఆయన ఆధ్వర్యంలో మండపేట మండలం వేములపల్లిలో శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ పేరుతో తనిఖీ చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో, ఖాళీ ప్రదేశాల్లోనూ వాహనాలను తనిఖీ చేయగా నంబర్లు, రికార్డులు లేని పలు వాహనాలు పట్టుబడ్డాయని సీఐ దొరరాజు తెలిపారు. కార్యక్రమంలో మండపేట రూరల్, అంగర, రాయవరం ఎస్సైలు వి. కిషోర్, జి.హరీష్‌కుమార్, డి.సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయానికి భూమిపూజ

రాయవరం: వెదురుపాకలోని రెడ్ల రామాలయం పునర్నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఇటికరాల సుబ్రహ్మణ్యశర్మ, అంగర జనార్ధనాచార్యుల అర్చకత్వంలో గ్రామానికి చెందిన చిన్నం వీర వెంకటసత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెదురుపాకలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు →



యానాం ఇన్‌చార్జి ఎస్పీగా కోదండరామ్ నియామకం

యానాం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, పెరిగిన భద్రతా అవసరాల దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు యానాం సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీగా) చింతా కోదండరామ్‌ను నియమిస్తూ శుక్రవారం పుదుచ్చేరి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (హెడ్‌క్వార్టర్స్) సుభమ్‌ఘోష్ ఆదేశాలు జారీ చేసారు. పుదుచ్చేరి పోలీస్ సర్వీస్ కేడర్‌కు చెందిన కోదండరామ్ పుదుచ్చేరి పీటీపీలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు యానాం ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. పోలీస్‌శాఖలో విధి నిర్వహణ ధ్యేయంగా సేవలు అందిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన చింతా కోదండరామ్ యానాంలో చింతావారివీధికి చెందిన వ్యక్తి కావడం విశేషం.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

అమలాపురం టౌన్: అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ నిబంధనలను సవరిస్తూ దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించనున్న ఎల్ఆర్ఎస్ స్కీమ్ పొడిగింపును అమలాపురంలోని అనధికార లే అవుట్ల రియల్టర్లు, కొనుగోలు చేసిన ప్లాట్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. 2025 జూన్ 30వ తేదీకి ముందు కొనుగోలు చేసిన వారు మాత్రమే ఈ స్కీమ్‌కు అర్హులని తెలిపారు. క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్వీకరణకు వచ్చే అక్టోబర్ 24వ తేదీ తుదిగడువు అని కమిషనర్ స్పష్టం చేశారు. రియల్టర్లు, ప్లాట్‌దారులు గడువులోపు స్పందించాలని సూచించారు. అనధికార లే అవుట్లలో ప్లాట్లు ఉన్న వారు, ఇప్పటికే ఆ ప్లాట్లను అభివృద్ధి చేసిన వారు, అర్హత కలిగి మునపటి ఎల్ఆర్ఎస్–2020లో దరఖాస్తు చేయని వారు స్పందించాలని కమిషనర్ నిర్మల్‌కుమార్ స్పష్టం చేశారు.

రేషన్‌కార్డులో మార్పులకు అవకాశం

యానాం: నియోజకవర్గ పరిధిలో సివిల్ సప్లయీస్ శాఖ ద్వారా మంజూరైన రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ఈనెల 18 వరకు అవకాశం ఇస్తున్నట్లు శుక్రవారం పుదుచ్చేరి సివిల్ సప్లయీస్ డైరెక్టర్ తెలిపారు. రేషన్‌కార్డుదారులు స్థానికంగా ఉన్న కామన్ సర్వీసెస్ సెంటర్లలో తమ 14 ఏళ్లలోపు పిల్లల పేర్లు, పెద్దల పేర్లు చేర్చుకోవడం, సభ్యుల పేర్లు తొలగించడం, రేషన్‌కార్డు సరెండర్ చేయడం, సభ్యుడి పేరు మార్పు, అడ్రస్ మార్పు, ఆధార్ అనుసంధానం, ఈ–రేషన్‌కార్డు, సభ్యుల పేర్లు మొత్తం నవీకరణ చేసుకోవచ్చునన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: అమలాపురం విద్యానిధి కళాశాలకు చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ కె.శంకర్, కో కన్వీనర్ కె.ప్రణీత్ సాయి డిమాండ్ చేశారు. అమలాపురంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటు విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థిని ఆత్మహత్యకు బాధ్యత వహించాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు నిర్బంధించి మార్కుల సాధనకు విద్యార్థులను వేధించడంతో మానసిక ఒత్తిడికి గురై వారు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని అన్నారు. కళాశాలకు అనుమతులు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబాన్ని కళాశాల యాజమాన్యం, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ శంకర్, కో కన్వీనర్ ప్రణీత్ డిమాండ్ చేశారు.

సచివాలయాలతో మెరుగైన పాలన

కాజులూరు: ప్రజలకు సచివాలయాల ద్వారా మెరుగైన పాలన అందించటంతో పాటు, అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం గొల్లపాలెం, దేగలపేట, బందనపూడి తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బందనపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని, రూ.4.5 లక్షలతో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు, రూ.4.28 లక్షలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు ప్రారంభోత్సవం చేశారు. ఇద్దరు బాధితులకు ఆర్థికసాయం అందించారు.